నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్వ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939



సంపుటి :12 సంచిక :310 రంగారెడ్డి | గురువారం 05 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada


# కొత్త సుప్రీం

## ఇరాన్ సుప్రీంగా

# మొజ్తబా ఖమేనీ



## అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ నిర్ణయం

## అయతుల్లా ఖమేనీ మృతితో కీలక డెసిషన్

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

టెహ్రాన్ : ఇరాన్ అధ్యక్షుడిగా ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు స్వీకరించారు. ఇరాన్ సుప్రీం నేతలు, అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఈ నిర్ణయం తీసుకుందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యకు గురైన సంగతి తెలిసిందే. మొజ్తబా ఎన్నికకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ బలమైన మద్దతునిచ్చినట్లు తెలుస్తోంది. మొజ్తబా దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించినప్పటికీ.. ఇప్పటివరకు ఎటువంటి అధికారిక పదవులు చేపట్టలేదు. ప్రస్తుతం, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ నేతృత్వంలోని తాత్కాలిక కమిటీ పరిపాలనా వ్యవహారాలను నిర్వహిస్తోంది.

కొత్త అధ్యక్షుడి ఎన్నికతో దేశంలో నెలకొన్న అనిశ్చితి పరిష్కారమవుతుందని భావిస్తోంది.



## హైదరాబాద్ మియాపూర్‌లో

# డ్రగ్స్ కలకలం..

హైదరాబాద్, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది: మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా.. ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్, ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా. దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాహుల్ గాంధీకి.. మందకృష్ణ లేఖ..



వరంగల్, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన సింగూరు డ్యామ్


# సేఫ్టీ పనులు పూర్తి చేయాలె

- పెద్దారెడ్డి లిఫ్ట్‌స్కీం డీపీఆర్ సమర్పించాలె
- మంత్రులు దామోదర, ఉత్తమ్, వివేక్
- సచివాలయంలో ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
- జులై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించాలని ఆదేశం




హైదరాబాద్, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది : యుద్ధ ప్రాతిపదికన సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు పూర్తి చేయాలని మంత్రులు దామోదర రాజ నర్సింహా, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌స్కీం పనుల డీపీఆర్‌ను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు. సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీపై ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. డ్యామ్‌సేఫ్టీ ప్రభుత్వానికి చాలా ముఖ్యమని మంత్రులు పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు డ్యామ్‌ను పరిరక్షించాలని, డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని సూచించారు. ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన చేసేలా చూడాలని ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలన్నారు. చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించాలన్నారు.

# రెండో సీటు ఎవరికి?




హైదరాబాద్, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది : తెలంగాణలో ఖాళీ అయిన రెండు రాజ్యసభ సీట్ల అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఒక సీటుకు అభిషేక్ మను సింఘ్వీ పేరు ఖరారైనప్పటికీ రెండో సీటుపై స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లగా, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను ఢిల్లీకి రావద్దని హైకమాండ్ సూచించినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికపై జూమ్ ద్వారా చర్చించాలంటూ అధిష్ఠానం తెలిపిన నేపథ్యంలో మహేష్ గౌడ్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. రెండో రాజ్యసభ సీటును తన అనుచరుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి దక్కించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని, మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ కుమారుడు డా. వినయ్ పేరును ఇప్పటికే సిఫారసు చేసినట్లు చర్చ సాగుతోంది. ఈ పరిణామాలతో పార్టీలో పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలు అందుబాటులో లేకపోవడంతో తన పర్యటన వాయిదా పడిందని మహేష్ గౌడ్ మీడియాకు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి హైకమాండ్‌తో జూమ్ ద్వారా అభ్యర్థుల ఎంపికపై చర్చిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## భూములు కోల్పోయే రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం: మంత్రులు



హైదరాబాద్, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది : ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక పరిహార చెల్లింపుకు సిద్ధంగా ఉన్నామని.. భూములు కోల్పోయే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయంగా తామే రైతుల వద్దకు వెళ్లి భూసేకరణ ప్రక్రియ చేపడతామని మంత్రులు వెల్లడించారు. గత ప్రభుత్వం భూసేకరణ, పరిహారంపై మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని, వారికి అమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరిస్తామని చెప్పారు. రామప్ప – లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు.

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 05, మార్చి 2026

## సిఫారసులు అమలైతే చాలు కౌలు రైతు గట్టెక్కినట్టే!

రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్ధశాస్త్ర సహాయాచార్యులుగా పనిచేస్తున్న నేను ఇటీవల నా విద్యార్థులతో కలిసి ఒక ప్రాజెక్టు పనిలో భాగంగా, చేవెళ్ళకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవుని ఎర్రవల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయగా రాష్ట్రంలోని రైతులు, ప్రత్యేకించి కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గమనించాం. వారిలో భూమి కలిగిన రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన తరువాత చాలా రోజులకు (కొన్నిసార్లు మూడు నెలల తరువాత) డబ్బులు తమ ఖాతాలో పడుతున్నాయని, అంతేగాక ఒకవేళ రైతు పంట రుణం తీసుకుని ఉంటే ఆ మొత్తాన్ని తగ్గించి మిగిలిన డబ్బును ఖాతాలో వేస్తున్నారని తెలిసింది. పంట కోతల తరువాత వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదని రైతులు తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుతం కంది పంటను కోశారు కానీ ఇంకా కందుల కొనుగోలు కేంద్రం చేవెళ్ళ వ్యవసాయ మార్కెట్‌లో మొదలు కాలేదు. అందువలన రైతులు కమీషన్ ఏజంట్లకు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (క్వింటాలుకు రూ.8000) కంటే తక్కువ ధరకు (క్వింటాలుకు రూ.6000–6500కు) అమ్ముకుంటున్నారు. 'రైతు భరోసా' అందని కారణంగా వ్యాపారుల దగ్గర విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరువు తెచ్చుకుంటున్నారు. ఫలితంగా ఆ వ్యాపారులకే ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముతున్నారు. రైతులు––కౌలు రైతులకు ఎకరానికి రూ.15––16 వేలు ప్రతి సంవత్సరం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. అంతేగాక వారికి పంట రుణాలు కూడా ఇవ్వడం లేదు. దేవుని ఎర్రవల్లిలో లాగానే రాష్ట్రంలో దాదాపు 50శాతం వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా పంట పెట్టుబడికి భూస్వాములు, కమీషన్ ఏజెంట్లు, బంధువులు, స్నేహితులపై ఆధారపడుతున్నారు. సంస్థాపరం కాని ఇలాంటి వ్యవస్థలపై ఆధారపడటం వల్ల వడ్డీ దోపిడీ ఎక్కువగానే ఉంటోంది. మరొక ముఖ్యమైన, అతి బాధాకరమైన విషయం ఏమిటంటే కౌలు రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నేరుగా అమ్ముకునే అవకాశం లేకపోవటం. వీరు అలా అమ్మాలంటే భూమి యజమాని తన పట్టా పాస్‌బుక్‌తో హాజరు కావాలి. ఇది చాలా క్రూరమైన నిబంధన. భూ యజమానులు అన్నిసార్లూ అందుబాటులో ఉండరు (కొందరు విదేశాలలో కూడా ఉన్నారు). ఉన్నా కొన్నిసార్లు రారు. ఫలితంగా కౌలు రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. భూ సంస్కరణలలో భాగంగా పశ్చిమబెంగాల్, త్రిపుర, జమ్మూ కశ్మీర్ మొదలైన రాష్ట్రాలలోని కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, ఇప్పుడు తెలంగాణలోను ఆ ప్రయత్నం జరగడంలేదు. 2011లో లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ యాక్ట్ ద్వారా రుణ అర్హత కార్డులు ఇచ్చే ప్రయత్నం ప్రారంభమైనా దాని అమలు కూడా చిత్తశుద్ధితో జరగడం లేదు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం ఇస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ఈ ఆర్థిక సహాయం అందలేదు. పంటల బీమా, రైతు బీమాతో పాటు కేంద్రం అమలుపరుస్తున్న పీఎం––కిసాన్ సమ్మాన్ నిధి కింద ఒక ఎకరానికి ప్రతి ఏటా ఇచ్చే రూ.6000లు కౌలు రైతులకు ఇవ్వడం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల పెట్టుబడి బీమా), ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (నీటి పారుదల సౌకర్యాల కోసం ఆర్థిక సహాయం), వ్యవసాయ అవస్థాపన నిధి (అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) పథకాలకు కౌలు రైతులు అర్హులు కాదు. కిసాన్ క్రెడిట్ కార్డులు వీరికి ఇవ్వరు. వ్యవసాయ పదార్థాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి రైతులకు సూక్ష్మ సంస్థల ఏర్పాట్ల కోసం 35శాతం సబ్సిడీతో గరిష్ఠంగా ఇచ్చే రూ.10లక్షల ఆర్థిక సహాయం వీరికి అందడం లేదు. తోట పంటల (హార్టీ కల్చర్) పెంపకం కోసం అందించే ఆర్థిక సహాయానికి వీరు అర్హులు కాదు. ఇలా చెప్పుకుంటూ పోతే రైతుల కోసం అమలు జరుగుతున్న అన్ని ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు కౌలు రైతుల కష్టాలు తీర్చడానికి అనేక కమిటీలు తమ సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చాయి. అందులో జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర ?స్థాయి కమిటీల దాకా ఉన్నాయి. దాదాపు అన్ని కమిటీలలో ప్రముఖంగా ఉన్న సాధారణ సిఫారసులు: 1) కౌలు రైతులకు చట్టబద్ధ గుర్తింపు తప్పనిసరి. 2) రాతపూర్వక లీజు ఒప్పందాలు. 3) పంట బీమా, విపత్తు పరిహారం, సబ్సిడీలలో నేరుగా చేర్చడం. 4) బ్యాంకు రుణాలకు ప్రత్యామ్నాయ భద్రత ఏర్పాట్లు. 5) కౌలు రైతులు మద్దతు ధర పొందేలా మార్కెటింగ్ సదుపాయాలు. 6) గ్రామ స్థాయి రికార్డుల్లో కౌలు వివరాలు నమోదు చేయడం. ఈ కమిటీల నివేదికలు పరిశీలించినప్పుడు అవి కౌలు రైతుల సమస్యలను అందరికీ తెలియజేయడమే కాదు, ఆ సమస్యల పరిష్కారం కోసం బుద్ధిజీవులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సూచనలు కూడా చేశారని స్పష్టంగా అర్థమవుతుంది. వాటి అమలుకు ప్రభుత్వాలు పూనుకుంటే కౌలు రైతుల సమస్యల పరిష్కారం అసాధ్యం కాదని కూడా అనిపిస్తుంది.

# మళ్లీ ట్రెండ్‌లోకి ఫ్రాయిడ్!




ఇప్పుడు మీరు ఇన్‌స్టాగ్రామ్‌లో స్క్రోల్ చేస్తుంటే, ఇన్‌ఫ్లుయెన్సర్ల మధ్య ఒక ఆశ్చర్యకరమైన ముఖం కనిపించవచ్చు. దట్టమైన గడ్డం, చేతిలో సిగార్‌తో గంభీరంగా కనిపిస్తున్న ఒక వ్యక్తి ముఖం అది. ఆయన సిగ్మండ్ ఫ్రాయిడ్. పందొమ్మిదో శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఆలోచనాపరులను ప్రభావితం చేసిన, మానవ మనస్తత్వం గుట్టువిప్పిన మనస్తత్వవేత్త ఆయన. ఇప్పుడు అనూహ్యంగా ఆయన మళ్ళీ వార్తల్లోకి వస్తున్నారు. దశాబ్దాలుగా ఫ్రాయిడ్ కాలం చెల్లిన వ్యక్తిగా పరిగణించబడ్డారు. "కాకికేమి తెలుసు సైకో ఎనాలసిస్సు?" అని శ్రీశ్రీ అన్నట్టు విమర్శకులు అనేకులు కాకుల్లా ఫ్రాయిడ్ ఆలోచనలపైన దాడి చేశారు. ఫ్రాయిడ్ చెప్పిన మనోవిశ్లేషణ విధానం (సైకో ఎనాలసిస్) అశాస్త్రీయమని తోసివుచ్చారు. మరికొందరు ఆయన ఆలోచనలు లింగవివక్షతో కూడుకున్నవని, ఆధునిక జీవితానికి సంబంధం లేనివని కొట్టిపారేశారు. కానీ ఇప్పుడు, ఆందోళన, రాజకీయ ఉద్రిక్తతలు, మానసిక అలసటతో నిండిన ప్రపంచంలో, ప్రజలు ఫ్రాయిడ్‌ను మళ్లీ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ పునరుజ్జీవనానికి కొంతవరకు పాపులర్ కల్చర్ కారణం. 'కపుల్స్ థెరపీ' అనే టెలివిజన్ సిరీస్‌తో ఇది మొదలైంది. ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్య సమస్యల చికిత్సకు సంబంధించి లోతైన థెరపీ సెషన్ల ప్రభావశీలతను ప్రపంచవ్యాప్తంగా టీవీ ప్రేక్షకులకు పరిచయం చేసింది. మరోవిధంగా చెప్పాలంటే సిగ్మండ్ ఫ్రాయిడ్‌ను వారి ఇళ్లకు చేరవేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో, "ఫ్రాయిడ్––గ్రామ్" ప్రొఫైల్స్ అంతఃచేతన గురించి, అందులో దాగిన కోరికల గురించి కోట్లాదిమంది ఫాలోవర్లతో పంచుకుంటున్నాయి. సైకో ఎనాలసిస్‌లో భాగంగా, సోఫాపై పడుకుని బాల్య జ్ఞాపకాల గురించి మాట్లాడటాన్ని ఒకప్పుడు జోక్‌గా భావించారు. అదే ఇప్పుడు మళ్లీ సీరియస్ విషయంగా మారింది. కానీ ఇది కేవలం ఇంటర్నెట్ ట్రెండ్ మాత్రమే కాదు. ఇది ఒక లోతైన మార్పును ప్రతిబింబిస్తుంది. ఈ మార్పునకు బలమైన కారణాలే ఉన్నాయి. 20వ శతాబ్దపు చివరలో, ముఖ్యంగా ఇంగ్లిష్ మాట్లాడే దేశాలలో, సైకోథెరపీ దిశ మారింది. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (జబీ) ప్రాధాన్యం సంతరించుకుంది. దానిలో 'సరైనవి కాని' ఆలోచనా విధానాలను సరిదిద్దడంపైనే దృష్టి సారించారు. అదే సమయంలో, మానసిక ఆరోగ్య చికిత్సలో మందులు ప్రధానమయ్యాయి. నిరాశ, ఆందోళనలను మెదడులోని రసాయన అసమతుల్యతగా అభివర్ణించారు. ఒక టాబ్లెట్ వేసుకోవడం అనే పరిష్కారం సులువుగా అనిపించింది. భావోద్వేగాలను నియంత్రించే మూడ్ డిజైనర్ మందు ప్రొజాక్ (మనదేశంలో ఫ్లుడాక్) రోజువారీ వాడే ఉత్పత్తుల్లో ఒకటిగా మారింది. మనస్సు కుంగుబాటుకు చికిత్సగా యాంటీ–డిప్రెసెంట్ మందుల వాడకం విపరీతంగా పెరిగింది. మన దేశంలో దాదాపు 5శాతం వయోజనులు ఈ మందులపై ఆధారపడుతున్నారు. అయినప్పటికీ–ఆందోళన, ఒంటరితనం, నిరాశ పెరుగుతూనే ఉన్నాయి. చాలా మందికి లక్షణాల నుంచి ఉపశమనం లభించినా, శాశ్వతమైన మానసిక ప్రశాంతత మాత్రం దక్కటం లేదు. ఈ పరిస్థితే ఫ్రాయిడ్ ప్రధాన ఆలోచనను మళ్లీ తెరపైకి తెచ్చింది: మన మానసిక జీవితంలో చాలా భాగం మనకు తెలియకుండానే అంతఃచేతనలో జరుగుతుంది. ఫ్రాయిడ్ ప్రకారం, దానిలో దాగి ఉన్న సంఘర్షణలు, భయాలు, కోరికలు మన ప్రవర్తనను మలుస్తాయి. మనం వాటిని విస్మరిస్తే, అవి మాయమైపోవు. పైగా అవి ఆందోళన, కోపం లేదా పదేపదే మనల్ని మనం దెబ్బతీసుకునే ప్రవర్తనల రూపంలో బయటకు వస్తాయి. దక్షిణాఫ్రికాకు చెందిన న్యూరో సైకాలజిస్ట్ మార్క్ సోమ్స్ ఇటీవల ఫ్రాయిడ్‌పై పెరుగుతున్న ఆసక్తికి బలమైన శాస్త్రీయ గొంతుకగా నిలిచారు. ఆయన పుస్తకం 'ది హిడెన్ స్ప్రింగ్స్– ఎ జర్నీ టు ద సోర్స్ ఆఫ్ కాన్షియస్'లో ఆధునిక మెదడు పరిశోధనను సైకో ఎనలిటికల్ ఆలోచనలతో ముడిపెట్టారు. కలలు, భావోద్వేగాలపై సోమ్స్ చేసిన అధ్యయనాలు, మానసిక జీవితంలో అంతఃచేతన స్థాయి ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయని సూచిస్తున్నాయి. మందులు లక్షణాలను తగ్గించగలవని, కానీ వాటి వెనుక ఉన్న భావోద్వేగ చోదకశక్తులను పూర్తిగా పరిష్కరించలేవని ఆయన వాదిస్తున్నారు. నిజమైన మానసిక స్వస్థత పొందడానికి అంతఃచేతనలో దాగిన భావాలను స్పృహ (చేతన)లోకి తీసుకురావాలని సోమ్స్ అంటారు. నిజానికి ఇంగ్లిష్ మాట్లాడే దేశాల వెలుపల ఫ్రాయిడ్ ఎప్పుడూ పూర్తిగా మరుగునపడలేదు. కొన్ని దేశాలలో మనోవైద్యం ఇప్పటికీ సైకో ఎనాలసిస్‌కు కట్టుబడి ఉన్నది. దీనికి స్పష్టమైన ఉదాహరణ బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా). ప్రపంచంలోనే అత్యధికంగా ప్రతి లక్ష మందికి 222 మంది మనస్తత్వవేత్తలు ఇక్కడ ఉన్నారు. అక్కడ థెరపీ అనేది దాచుకోవాల్సిన విషయమో లేదా అవమానకరమో కాదు; అది చాలా సాధారణం. ఆ దేశం కఠినమైన కాలంలో కొనసాగిన సమయంలో ఈ సంప్రదాయం బలపడింది. 1976–1983 మధ్య అర్జెంటీనా మిలిటరీ నియంతృత్వంలో ఉన్నప్పుడు సుమారు ముప్పైవేల మంది 'అదృశ్యం' అయ్యారు. కుటుంబాలు భయంలో నిశ్శబ్దంలో ఉండిపోయాయి. అటువంటి వాతావరణంలో సైకో ఎనాలసిస్ ప్రజలకు ఒక అరుదైన అవకాశాన్ని ఇచ్చింది, బహిరంగంగా మాట్లాడటానికి ఒక వ్యక్తిగత స్థలాన్ని ఇచ్చింది. బాధ గురించి మాట్లాడటం ఒక ప్రతిఘటన ప్రకటనగా, అవకాశంగా మారింది. సమాజం అణచివేయాలని చూసినా సత్యాన్ని వ్యక్తీకరించాలనే ఆలోచన థెరపీకి ఒక రాజకీయ కోణాన్ని ఇచ్చింది. మరోవైపు ఆధునిక సమస్యలకు మనోవిశ్లేషణ ప్రభావశీలమైన పాత పరిష్కారంగా ముందుకు వస్తోంది. ఇప్పుడు ఆలోచనాపరులు ఆధునిక సమస్యలను పరిశీలించడానికి సైకో ఎనాలసిస్‌ను ఉపయోగిస్తున్నారు. ఫ్రాయిడ్ ఇప్పుడు ఎందుకు సందర్భోచితంగా అనిపిస్తున్నారని చూస్తే రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది వేగం జం సహనం. మనం వేగాన్ని ఆరాధించే యుగంలో ఉన్నాం. కానీ సైకో ఎనాలసిస్ దీనికి విరుద్ధం. ఇది నెమ్మదిగా సాగుతుంది, ఏళ్ల తరబడి టైమ్ పట్టవచ్చు. ఇది బాల్యం, కోరిక, అపరాధ భావం, భయం గురించి అసౌకర్యంగా అనిపించే ప్రశ్నలను అడుగుతుంది. శాశ్వత మార్పునకు ఓపిక, నిజాయితీ అవసరమని ఇది నమ్ముతుంది. రెండోది అణచివేత. ఫ్రాయిడ్ చెప్పిన 'అణచివేత' అనే అంశం వ్యక్తులకే కాదు, సమాజాలకు కూడా వర్తిస్తుంది. విస్మరించబడిన గాయాలు, నిరాకరించబడిన చరిత్ర, అణచివేసిన సంఘర్షణలు ప్రమాదకరమైన రీతిలో మళ్లీ బయటపడతాయి. సిగ్మండ్ ఫ్రాయిడ్ పరిపూర్ణంగా ఆమోదం పొందినవాడు ఏమీ కాదు. ఆయన ఆలోచనలు చాలా వరకు వివాదాస్పదంగానే ఉన్నాయి. అయినప్పటికీ, 'మన మనస్సు గురించి మనకే పూర్తిగా తెలియదు' అనే ఆయన ప్రధాన వాదన నేటికీ నిజమనిపిస్తోంది. ఇవాళ సోఫాలో కూర్చుని సైకో థెరపీ తీసుకోవటం అనేది ధనవంతుల విలాసం కాదు. గందరగోళంగా ఉన్న ఈ కాలంలో సాంత్వన పొంది జీవించడానికి అది ఒక సాధనంగా మారుతోంది. విధ్వంసం విస్తరిస్తున్న నేటి ప్రపంచంలో లోతైన ఆత్మపరిశీలన, భావోద్వేగపరమైన వాస్తవం చాలా అవసరమని ఎక్కువమంది గుర్తిస్తున్నారు. మనసును తొలిచివేస్తున్న భావాలను, వేదనలను ఎటువంటి అభిప్రాయాలు ఏర్పరచుకోకుండా వినగలవారు అందుబాటులో ఉన్నారన్న విశ్వాసాన్ని మించి ఉపశమనం ఇవ్వగల అంశం ఈ శతాబ్దంలో ఇంకేదీ లేదు.

# ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి...

వారు ఎప్పుడూ నేర్చుకోరు, ఎప్పటికీ మారరు. ఒక సార్వభౌమిక దేశాన్ని దుర్బలం చేసేందుకు కలహశీల అమెరికా అధ్యక్షుడు ఒకరు మరోసారి విధ్వంసక దాడులకు పూనుకున్నారు. తన చర్యను సమర్థించుకునేందుకు పచ్చి అబద్ధాలు, సత్యదూర వాదనలు ప్రచారం చేస్తున్నారు. ఆ దౌర్జన్యాన్ని ముందస్తుగా సంకల్పించారు, ఆ దుష్ట సంకల్పం ప్రపంచానికి వెల్లడి కాకుండా మోసపూరిత శాంతి చర్చల తంతు జరిపారు. సంయమనం వహించాలన్న మిత్రదేశాల సలహాను పాటించలేదు. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయ నియమాలు, ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేశారు, మరోసారి ఆ సార్వభౌమిక దేశంపై అత్యాధునిక విధ్వంసక ఆయుధాలతో విరుచుకుపడ్డారు. గతంలో వలే ఇప్పుడు కూడా అమెరికా దౌర్జన్య చర్య ఫలితం ఊహించలేనిదేమీ కాదు: ఇరాన్‌కు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో మళ్లీ ప్రారంభమైన అమెరికా––ఇజ్రాయెల్ దాడి మహా విధ్వంసంతో అల్లకల్లోలాన్ని సృష్టించింది. పరిస్థితులను ఇంకా భయానకం చేస్తోంది, అంతర్జాతీయ చమురు విపణి కుదేలయిపోతోంది. టెహ్రాన్ పాలకుల మద్దతు ఉన్న హెజ్బొల్లా, హౌతీ సాయుధ బృందాలు రంగంలోకి దిగడంతో కొత్త విద్వేషాలు రగుల్కొంటాయి, ఉగ్రవాద ప్రతీకారాలు విజృంభిస్తాయి. పాశ్చాత్య ప్రపంచ విరోధులు మాత్రమే పరమానందం పొందుతారు. సార్థక ఫలితాలు ఏవైనా సమకూరుతాయా? అసాధ్యం. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో అమెరికా నేతృత్వాన పాశ్చాత్య దేశాల జోక్యపు చేదు ఫలితమే ఇప్పుడూ ఇరాన్‌లో చూడబోతున్నాం. అఫ్ఘాన్, ఇరాక్‌లలో జోక్యాలు క్షమించరానివి! ఆ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోనేలేదు. ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి తాను నిర్దేశించినట్టు నడిచేలా చేయగలనని 21వ శతాబ్ది ప్రజలు ఎన్నుకున్న అమెరికా అధ్యక్షుడు ఒకరు విశ్వసించడం విస్మయకరం! నైతిక వివేచన పూర్తిగా కొరవడిన నిర్ణయ ఫలితమే ఇరాన్‌పై దాడి. జార్జి బుష్ హయాంలో 2003లో ఇరాక్ దురాక్రమణ, ఇప్పుడు ఇరాన్‌పై భీకర దాడులు రెండూ ఒకే విధమైనవి. ఇతర దేశాలలో అమెరికా జోక్యాలు–– వియత్నాంలోనూ, 1953లో సీఐఏ ఆధ్వర్యంలో జరిగిన పాలన మార్పు రెండూ అంతిమంగా విఫలమయ్యాయి. ఆ వైఫల్యాలకు అమెరికా భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. విదేశాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని నివారిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. అది కల్తీలేని బొంకుమాట. ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాల తీరుతెన్నులను ట్రంప్ మార్చివేయగలరని విశ్వసిస్తున్నవారు 1945 అనంతరం సామ్రాజ్యవాద దురహంకారంతో అది పాల్పడిన నీతిబాహ్య చర్యలను ఓసారి సమీక్షించండి. పూర్వపు అధ్యక్షులకు ట్రంప్ భిన్నమైన వ్యక్తి కాదు. జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి తీసుకువెళ్లిన తరువాత ఆ దేశంలోని చమురు సంపద మాత్రమే తనకు అవసరమని ట్రంప్ అన్నారు. అయితే ఆ తరువాత ఇతర విషయాలలో సంభవిస్తున్నది గమనిస్తే అమెరికా సామ్రాజ్యవాద జోక్యాల తుచ్ఛ చరిత్రకు భిన్నంగా లేదని అర్థమవుతుంది. జార్జి బుష్ మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ సైతం అబద్ధాలే పునాదిగా ఒక సంక్షోభాన్ని సృష్టించారు. బుష్, ఆయన సహ నేరస్థుడు టోనీ బ్లెయిర్ వలే ట్రంప్ సైతం ఉద్దేశపూర్వకంగా ఇరాన్ నుంచి సంభావ్య ముప్పును గోరంతలు కొండంతలు చేశారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని, వాటివల్ల యూరోపియన్ దేశాలలోని అమెరికా బలగాలకు ముప్పు ఏర్పడవచ్చుని, ఆ క్షిపణులు అమెరికా భూభాగాలకు కూడా చేరగలవని పదే పదే చెప్పారు. సద్దాం హుస్సేన్ కల్పిత ఆయుధాల విషయంలో బుష్ ప్రభృతులు చేసినటువంటి తప్పుడు ప్రచారాన్నే ఇరాన్ విషయంలో ట్రంప్ చేశారు. ఇరాన్ దాడులకు సిద్ధమైనందునే తాము ముందస్తు దాడులు చేశామన్న ఇజ్రాయెల్ వాదనలో సత్యం ఏ మాత్రం లేదు. గత ఏడాది జూన్‌లో అమెరికా––ఇజ్రాయెల్ మొదటి సంయుక్త దాడి అనంతరం నెలకొన్న శాంతియుత పరిస్థితులను పరిరక్షించుకునేందుకే ఇరాన్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. అణ్వాయుధాల తయారీ సామర్థ్యాన్ని సైతం ఇరాన్ వేగంగా సమకూర్చుకుంటోందని ట్రంప్ చేస్తున్న వాదనను గత ఇరవై ఏళ్లుగా ఇరాన్ పాలనావ్యవస్థ సర్వోన్నత అధినేత మొదలు జూనియర్ మంత్రి దాకా ప్రతి ఒక్కరూ ఖండిస్తూ వస్తున్నారు. 'తాము ఎట్టి పరిస్థితులలోనూ అణ్వాయుధాన్ని అభివృద్ధి పరచబోమని' ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాషి నిన్నగాక మొన్న స్పష్టంగా ప్రకటించారు. దీనిపై వాద ప్రతివాదాలు జరిగాయి. అయితే ఇరాన్ అణ్వాయుధాల తయారీలో పురోగతి సాధించినట్టు ఎటువంటి రుజువులను అమెరికా, ఐక్యరాజ్యసమితి అధికారులుగానీ నెతన్యాహు గానీ ప్రపంచానికి వెల్లడించలేకపోయారు. 'అమెరికా ప్రజాస్వామ్యానికి, ప్రపంచ భద్రతకు ట్రంప్ ఒక పెనుముప్పుగా పరిణమించారు' అని బరాక్ ఒబామా పాలనలో జాతీయ భద్రతా వ్యవహారాలలో కీలక బాధ్యతలు నిర్వహించిన బెన్ రోడెస్ వ్యాఖ్యానించారు. మన ఆధిక్యతను అంగీకరించని, మన మార్గాన్ని అనుసరించేందుకు సుముఖంగా లేని దేశాలను లొంగదీసుకోవాలని అమెరికన్ ఆదర్శాలు పురిగొల్పుతాయా? అని రోడెస్ విస్మయం వ్యక్తం చేశారు.

## లైన్మెన్ దినోత్సవం సందర్భంగా విద్యుత్ సిబ్బందికి ఘన సన్మానం



బెల్లంపల్లి, మార్చి 04 నిర్భయవార్త ప్రతినిధి: లైన్మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న ఓ డ ఎమ్ స్టాఫ్, ఆర్టిజన్‌లు, అన్మ్యాన్డ్ వర్కర్స్‌కు ఘనంగా సన్మానం నిర్వహించారు. ప్రమాదాలను లెక్కచేయకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్న లైన్మెన్ల సేవలను అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏ.డి.ఏ కాటం శ్రీనివాస్, బెల్లంపల్లి టౌన్ సబ్ ఇంజనీర్ కె. మౌనిక చేతుల మీదుగా సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించారు. రోజూ ఎండ, వర్షం తేడా లేకుండా ప్రజల కోసం కష్టపడుతున్న విద్యుత్ సిబ్బంది సమాజానికి ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో నిరంతర సేవలు అందిస్తున్న సిబ్బంది అంకితభావాన్ని అధికారులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవాస్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చొప్పదండి నియోజకవర్గం లో 3500 ఇండ్లను మంజూరు చేసాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





నిర్భయవార్త ప్రతినిది: మార్చ్4: గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు బొజ్జ సునీత తిరుపతి దంపుతుల గృహప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సునీత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో నాటి కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## గుమ్మడిదలలో ఘనంగా హోలీ వేడుకలు

**మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్**




నిర్భయవార్త ప్రతినిది: గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో హోలీ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సికేజి యువసేన సభ్యులు, యువకులు కలిసి రంగులు చల్లి ఆనందంగా సంబరాలు జరుపుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావంతో పండుగను జరుపుకున్నారు. హోలీ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో, ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సద్ది విజయ్ భాస్కర్ రెడ్డి, హుస్సేన్, దాసరి ఆంజనేయులు, సీకేజీ యువసేన సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా క్రీడాకారుడు హిమ గణేష్

**దివ్యాంగులను క్రీడలలో ప్రోత్సహిస్తాం: డాక్టర్ రవి కృష్ణ**



నంద్యాల నిర్భయవార్త ప్రతినిది: మార్చి 04: నంద్యాల జిల్లా బనగానపల్లె లో వెటర్నరీ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దివ్యాంగ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు హిమ గణేష్ విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొని విజేతగా నిలిచి, హైదరాబాదులో ఆరవ తేదీ నుండి జరగనున్న ఏడవ జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో రాష్ట్ర జట్టు తరపున పాల్గొనడానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి ఎం.పి.వి. రమణయ్య హిమ గణేష్ ను శాలువా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గణేష్ జాతీయ స్థాయి పోటీలలో కూడా విజేతగా నిలిచి రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు క్రీడలలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ను సంప్రదించాలని కోరారు. క్రీడలలో దివ్యాంగులను ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంపీ వి రమణయ్య,కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి, సినీ, టీవీ నటులు ఎస్.ఆర్.ఎస్.ప్రసాద్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కుమార్ యాదవ్, కళారాదన కార్యవర్గ సభ్యుడు శివరామిరెడ్డి, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

## 6వ వార్డులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: కౌన్సిలర్ సల్ల క్రిష్ణవేణి



బెల్లంపల్లి మార్చి 04 నిర్భయవార్త ప్రతినిది: బెల్లంపల్లి 6వ వార్డులో చెత్తను తొలగించిన వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి రజిత బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం విస్తృత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కొంతకాలంగా పలు వీధులు, గల్లీలు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి, సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ, పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బంది సూచనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డు శుభ్రత కోసం నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. డ్రైనేజీ కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ పొడి చల్లి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం,దోమల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## బెంగళూరు నుంచి డ్రగ్స్ అక్రమ రవాణా-ముగ్గురి అరెస్ట్



నిర్భయవార్త ప్రతినిది: సైబరాబాద్:బెంగళూరు నుంచి తక్కువ ధరకు నిషేధిత ఎండీఎంఏను కొనుగోలు చేసి నగరంలో అధిక లాభాలకు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను సైబరాబాద్ కమిషనరేట్ లోని మియాపూర్ పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటి బృందం సంయుక్తంగా చాకచక్యంగా పట్టుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వంభర కాలనీ పార్క్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం వోక్స్ వ్యాగన్ కారులో మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మెరుపు దాడి చేయగా, తప్పించుకునేందుకు ప్రయత్నించిన బేరి హనుమంతు (27), భూమని మహేష్ (26), కాసం ఆదర్శ్ (28)లను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12.6 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్, నాలుగు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. అదనపు డీసీపీ ఎం. సుదర్శన్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్ అనంతరం నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశామని, డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రజలు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## అద్దె భవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టల్స్ కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి



కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది: కడప రాఖీ× కడప నగర కమిటీ ఆధ్వర్యంలో సాంఘిక, సంక్షేమ హాస్టల్ సమస్యల పరిష్కారం కోరుతూ పోస్ట్ కార్డు ఉద్యమం శ్రీకారం చుట్టిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి.ప్రస్తుతం పెరిగిన ధరలు అనుకూలంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు 3000 కు పెంచాలి.సంక్షేమ హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న వార్డెన్ మరియు కుక్కు వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయాలి.అద్దె భవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టల్స్ కు సొంతభవనాలు ఏర్పాటు చేయాలి. ప్రతి సంవత్సరం సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి కోసం నిధులు కేటాయించి మరమత్తులు చేయించాలి మౌలిక వసతులు కల్పించాలి.అందులో భాగంగా కడప లోని సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ద్వారా రాష్ట్ర ముఖ్య మంత్రి గారికి పోస్ట్ కార్డు లు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు కార్తీక్, అఖిలేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



తాండూర్,నిర్భయవార్త ప్రతినిది: (మార్చి 04) కూరగాయల సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుందని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి అర్చన తెలిపారు. ఆమె బుధవారం తాండూర్ మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో కూరగాయలు బాగు చేస్తున్న రైతుల పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ఎకరానికి 9600/- రూలను ఉద్యాన శాఖ నుంచి అందించటం జరుగుతుందని తెలియజేశారు. తీగ జాతి కూరగాయలు, ఇతర కూరగాయలు సాగు చేసే రైతులు పట్టా పాస్ బుక్ జెరాక్స్, ఆధార్ కార్డు జెరక్స్, బ్యాంకు అకౌంట్ జిరక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో బెల్లంపల్లి ఉద్యాన అధికారిని సంప్రదించాలని కోరారు.

## రైతులకి ఎరువు కొరత లేదు



నిర్భయవార్త ప్రతినిది: పిట్లం మండలం 04 మార్చ్: పిట్లం మండలంలో ఎవరికి యూరియా కొరతలేదని మండల వ్యవసాయ అధికారి వినోద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం మండల వ్యాప్తంగా 16,000 మంది రైతులు ఉన్నారు ఇప్పటివరకు 4460 మంది రైతులు 12,560 యూరియా బస్తాలను ఫర్టిలైజర్ యూరియా ఆఫ్ ద్వారా పొందడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ యాప్ పట్ల రైతులు మక్కువ చూపుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యాడ్ల పంపిణి




దమ్మపేట, నిర్భయవార్త ప్రతినిది: మార్చి 04: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్కారం గవర్నమెంట్ హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా ఇంచార్జ్ గిద్దే కొండయ్య తరుపున 30 మంది స్కూల్ పిల్లలకు పరీక్ష ప్యాడ్ లను ట్రస్టు ద్వారా అందజేయడం జరిగింది. పిల్లలందరూ మంచిగా చదివి పరీక్ష ప్యాడ్ల కొరకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలి అనే ఉద్దేశంతో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఊటుకూరు వెంకట్ ఈ ప్యాడ్లు దాతల సహాయ సహకారాలతో అందజేయడం జరిగింది. పరీక్షా ప్యాడ్లు తీసుకున్న పిల్లలందరూ దానధర్మఛారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులందరికీ వారి యొక్క సంతోషాన్ని మనస్ఫూర్తిగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముల ప్రసాద్, చిట్టిబాబు,రావూరి వీరయ్య, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా లైన్మెన్ దివాస్



లక్షెట్టిపేట, నిర్భయవార్త ప్రతినిది:మార్చి4: పట్టణంలోని ఏడీఈ కార్యాలయ ఆవరణలో లైన్ మెన్ దివాస్ ను పురస్కరించుకొని బుధవారం పలువురు లైన్ మెన్ లను ఘనంగా శాలువా కప్పి సన్మానించి, లైన్మెన్ దివాస్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, నియంత్రణ విభాగాల్లో లైన్ మెన్ లు నిరంతరం అప్రమత్తంగా ఉండటం వలననే వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలుగకుండా సేవలు అందుతాయని వివరించారు. రాత్రి,పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా విషయంలో లైన్మెన్ లు కీలకంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. సంస్థ సీఎండీ ఆదేశాలతో లైన్మెన్ లను సత్కరించి, మెమెంటో లను బహుకరించినట్లు తెలిపారు. అంతకుముందు ఏఈ గణేష్ మాట్లాడుతూ లైన్ స్టాఫ్ అంకిత భావంతో పని చేయాలని, సంస్థ ప్రతిష్టను మరింతగా పెంచాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో భద్రత నియామాలు పాటిస్తూ, అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం లైన్మెన్ లను సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక పండుగలు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




నిర్భయవార్త ప్రతినిది:మార్చ్4: గంగాధర మండలం గర్షకుర్తి లోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, సంస్కృతి సంప్రదాయాలకు పండుగలు ప్రత్యేకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ పురోహితులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు సాగర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేలు ఆశీర్వదించి తీర్థ,ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ , స్థానిక సర్పంచ్ చిందం ఆంజనేయులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్ , రామిడి రాజిరెడ్డి, చిప్ప చక్రపాణి ,సాగి అజయ్ రావు,రాజ గోపాల్ రెడ్డి, గుండా రాజేశం, శ్రీనివాస్,మ్యాక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి సిఇసి మెంబర్ ఎన్నికైన.. సురేష్ బాబుకు సన్మానం




కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది: కడప నగరం లోని అపూర్వ కళ్యాణ మండపం నందు వైఎస్ఆర్సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన కె. సురేష్ బాబును కడప నగర మేయర్ పాక సురేష్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ బాబుకు పార్టీలో సిఇసి మెంబర్ నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతకు సురేష్బాబు కృషి ఎనలేదన్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పిం చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని అధికా రంలోకి తెచ్చి వై.ఎస్. జగన్ ను ముఖ్యమంత్రిని చేసు కోవడమేతమ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వంఅనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. నవరత్నాల పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిం దన్నారు. సుపరిపాలన కోసం వైసీపీని అధికారంలోకి రావాల్సిన అవసరం ముందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్ క్రీం రవీంద్రా రెడ్డి, సీనియర్ నాయకులు రాణా ప్రతాప్, 44వ డివిజన్ ఇంచార్జ్ రామ కృష్ణ రెడ్డి 7వ డివిజన్ ఇంచార్జ్ గంగ రాజు, కడప నగర ప్రధాన కార్యదర్శి రెడ్లయ్య, వైఎస్ఆర్సీపీ నాయకులు వాసు, రఘునాథ రెడ్డి, రామాంజి రెడ్డి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత



కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది: ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. పరిక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఆమ లులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల సెంటర్ల వద్ద సిఐ లు, ఎస్ఐలతో పాటు, పోలీస్ సిబ్బందిని నియ మించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సెంటర్ల వద్ద మొబైల్ ఫోన్లు ఎలక్ట్రా నిక్ పరికరాలు, తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రశ్నపత్రాల రవాణా భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమానస్పద వ్యక్తులపై నిసూ ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, సంఘటనలు తలెత్త కుండా పోలీస్ అధికా రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.

# అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



ములుగు జిల్లా వెంకటాపురం నిర్భయవార్త ప్రతినిది: ప్రసాద్( మార్చి 4 ) భక్తజన సందోహం నడుమ వైభవంగా తిరుకళ్యాణ మహోత్సవం భారీగా తరలి వచ్చిన భక్తులు వెంకటాపురం మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం విశ్వ వసు నామ సంవత్సరం బుధవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పగలు12,45 నిమిషాలకు అర్చకుల మంత్రోత్సరాల నడుమ తిరు కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పక్క రాష్ట్రమైన చతిస్గడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి తరలివచ్చేరు దీనితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ చలువ పందిళ్ళు తాగునీటి సౌకర్యం తరలి వచ్చిన భక్తజనంతో పెద్ద ఎత్తున సందడి నెలకొంది జాతరకు వచ్చే భక్తులకు భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు మండల పార్టీ ఆధ్వర్యంలో మంచినీటి బాటిలను అన్నదాన కార్యక్రమం నిర్వహించారు తిరు కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి గూడపర్తి నరసింహమూర్తి గంప రాంబాబు కాంగ్రెస్ నాయకులు చిట మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు





# గండికోట బాలిక హత్య కేసు దర్యాప్తు మరింత వేగవంతం

**అనుమానితులకు బ్రెయిన్ మ్యాపింగ్ టెస్ట్ అర్బన్ సిఐ నరేష్ బాబు**



కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది:జమ్మలమడుగు, గతేడాది జూలై 14 న జమ్మలమడుగు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో మైనర్ బాలిక పసుపులేటి వైష్ణవి హత్యకు గురైందని జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్పీ నచికేత్, డి.ఎస్.పి వెంకటేశ్వర రావుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ మృతురాలు వైష్ణవి సోదరుడు బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 15.07.2025 తేదీన జమ్మలమడుగు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయిందని ఆయన తెలిపారు. ఈ కేసులో ఉన్న అనువానితుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని కొంతమంది అనుమానిత ముద్దాయిల గురించి సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సీసీ కెమెరాలు ద్వారా, సిడిఆర్ అనాలసిస్ ఆధారముగా క్షుణ్ణంగా దర్యాప్తు చేయడం అయింది. ఈ దర్యాప్తులో భాగంగా కొంతమంది అనుమానితులనుజమ్మలమడుగు కోర్టు ఉత్తర్వుల మేరకు గుజరాత్ లోని గాంధీనగర్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నందు అనుమానితులను ప్రవేశపెట్టి వారిపైన బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్ష చేయించామని తెలిపారు. తదుపరి ఆ పరీక్ష రిపోర్టు ల్యాబ్ నుండి 15 20 రోజులలో రావాల్సి ఉందని ఆ రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

**ప్రిన్సిపాల్ డా. కాంపల్లి శంకర్**




బెల్లంపల్లి, మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది: గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ బెల్లంపల్లి లో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోబోయే విద్యార్థులు కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ పిలుపునిచ్చారు. అకాడమిక్ కార్యక్రమాలలో భాగంగా బుధవారం ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద కళాశాల బోధన సిబ్బంది అడ్మిషన్ కరపత్రాలను పంపిణీ చేశారు. పరీక్షలు పూర్తి చేసి బయటకు వచ్చిన విద్యార్థులతో అధ్యాపకులు మాట్లాడి కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాలపై వివరాలు తెలియజేశారు.కళాశాలలో బిఏ ఆనర్స్ మూడు సంవత్సరాల కోర్సుతో పాటు బిఏ సీబీసీఎస్ కాంబినేషన్లలో పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, ఎకనామిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బీకాం కంప్యూటర్స్, బీకాం టాక్సేషన్, బీకాం బిఎఫ్ఎస్ఐ కోర్సులు, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ కోర్సులు కూడా విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు పీజీ స్థాయిలో మూడు కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కళాశాలలో చదివే విద్యార్థులకు బెల్లంపల్లి పట్టణంలో వసతి గృహ సదుపాయం కూడా కల్పించబడుతున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోబోయే విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని, మరిన్ని వివరాలకు 9959269975 నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత

**3,4,5 డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషన్ రాకేష్ చంద్ర**



కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది: కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర మార్నింగ్ విజిట్ భాగంగా నేడు 3, 4, 5వ డివిజ న్లలో పారిశుధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. అలాగే ఉకాయపల్లి జిటి ఎసు సంద ర్శించి అక్కడి పరిశుభ్రత, చెత్త తరలింపువిధానం మరియు నిర్వహణను సమీక్షించారు. అదేవిధంగా హాజరు నమోదు ను కూడా పరిశీలించి, సమయ పాలన పాటించాలని అధికారులకు, సిబ్బం దికి ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించ బోదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఒక్కరూ సమయపాటించి విదులకు హాజరు కావాలని ఆయన సూచించారు.

# ఇటిక్యాలలో ఘనంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం






రాయికల్ మార్చి4 నిర్భయవార్త ప్రతినిది: రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. గ్రామ ప్రజలు,పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. ఉత్సవంలో భాగంగా స్వామివారి రథాన్ని ఊరేగించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతూ భక్తిభావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నమనేని విష్ణువర్ధన్ రావు, వంశీ వర్ధన్ రావు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సర్పంచ్ నీరటి శ్రీనివాస్,ఉప సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు హాజరయ్యారు. ఉత్సవాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

# శంకులపల్లి లో 19వ వార్డు కౌన్సిలర్ కి ఘన సన్మానం...





జగిత్యాల రూరల్ ఫిబ్రవరి 4 నిర్భయవార్త ప్రతినిది: జగిత్యాల పట్టణ శివారులో గల శంకులపల్లి గ్రామంలో 19వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి ఏనుగుల లావణ్య రాజేందర్ గారికి ఘన సన్మానం జరిగింది. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గుడ్లు మరియు బాలామృతం పంపిణీకి హాజరైన కౌన్సిలర్ శ్రీమతి ఏనుగుల లావణ్య గారిని అంగన్వాడి టీచర్ ఎస్.నీరజ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఏడు నెలల నుంచి మూడు సంవత్సరంలోపు పిల్లలకు పౌష్టికాహారం, కోడిగుడ్లు, బాలామృతం ఎంతో అవసరమని, వాటిని తప్పకుండా ఉపయోగించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నీరజ,ఆయా శంకరమ్మతోపాటు గర్భిణీలు రమ్య, సౌజన్య తల్లులు సూరవ్వ, నీలి రాజు, ఎం.డి.వాజిర, రామిడి దుబ్బమ్మ,ఏలేశ్వరం సౌజన్య, ఎం.మంజుల పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతరను జయప్రదం చేయండి

**ఆలయ పూజారి మడకం దేవ**



చర్ల మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది: లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని జాంబవంతుని గుట్టల పై వెలసిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ పూజారి మడకం దేవ తెలిపారు. 8 వ తేదీన ఇంటి ఇలవేల్పు మండే మెలుగుట తో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. తొమ్మిదిన సుంకు పోయుట పదవ తేదీన బోనాలు మరియు ఆదివాసీ పూజారులచే పట్నం వేయుట. 11 వ తేదీన మేల తాళాలతో డోలు సన్నాయిలతో ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో రంగ రంగ వైభవంగా కన్నుల పండుగగా శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ పూజారి మడకం దేవ తెలిపారు. కావున యావమ్మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మ వారి కృపకు పాత్రులు కాగలరనీ కోరారు.

## వేసవి దృష్ట్యా ముందస్తుగా మూడు నెలల రేషన్ పంపిణీ

**మోదీ నిర్ణయంపై కౌకుంట్ల చంద్రారెడ్డి హర్షం**



నాగారం, నిర్భయవార్త ప్రతినిది: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రేషన్ షాపుల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని అన్నారు. వేసవి వేడిలో రేషన్ షాపుల వద్ద వందల సంఖ్యలో క్యూలైన్లు కట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మూడు నెలల రేషన్‌ను ముందుగానే పంపిణీ చేయాలనే నిర్ణయం తీసుకోవడం ప్రజాహిత దృష్టితో కూడిన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను సమానంగా అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేస్తుందని కౌకుంట్ల చంద్రారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు





మల్కాజ్గిరి, నిర్భయవార్త ప్రతినిది: రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పరిధిలోని మల్కాజ్గిరి పద్మశాలి సంఘం కార్యాలయంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని పలు పద్మశాలి సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యాలయాన్ని సందర్శించి అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజ్ కుమార్ తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలి కులబంధువులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగ మన జీవితాలను ఆనందంతో, ఐక్యతతో నింపాలని, ద్వేషాలను దూరం చేసి ప్రేమ, సఖ్యతను పెంపొందించేందుకు పండుగలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఎగ్జిబిషన్ ఎక్సపో ఫౌండర్ ఇప్పలపల్లి రమేష్, కోశాధికారి బింగి నవీన్, ఉపాధ్యక్షులు వనమాల శంకర్, ఆఫీస్ జనరల్ సెక్రటరీ వాడిచెర్ల మారుతీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలిగేటి దేవేందర్, వల్లకాటి శ్రీనివాస్, బొల్లిగూడెం సంఘం అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్, ఆల్వాల్ సంఘం అధ్యక్షులు ఎర్రగుంట శ్రీనివాస్, కోశాధికారి రచ్చ వెంకటేష్, కృష్ణమూర్తి, సెక్రటరీ సూర్యప్రకాశ్, ధ్రువకుమార్, శ్రీరామ్ మధు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ బేస్మెంట్ బిల్లు మంజూరు కై నిరీక్షణ

**నాలుగు నెలలు దాటిన బిల్లు రాని వైనం**

**బిల్లు విడుదలయితే నిర్మాణం ముందుకు సాగెను**

**బిల్లు మంజూరు చేసి పేదల సొంతింటి కల సహకారం చేయాలి..**



ఖమ్మం మార్చి 5 నిర్భయవార్త ప్రతినిది: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పేదల సొంతింటి కల సహకారం చేయాలని ఉద్దేశంతో నెలకొన్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన లబ్ధిదారులకు మంజూరైనప్పటికీ సొంత జాగాలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సర్వే హయాంలో ఇల్లు లేక గత దివంగత రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ఆ ఇండ్లలో రెంట్ కు ఉండడంతో అధికారులు స్లాబ్ ఇల్లని శ్రీ3 లో చేర్చడం ద్వారా ప్రస్తుతం ఇంటి నిర్మాణం బేస్మెంట్ లెవెల్ పూర్తయి మొదటి బిల్లుకు అప్రూవల్ చేయగా బిల్లు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసుకుని మరి ఇల్లు నిర్మాణం చేస్తున్నప్పటికీ సకాలంలో బిల్లు రాక స్టేజి వైస్ అధికారుల దగ్గర పెండింగ్ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్3 లో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇండ్లకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బిల్లు మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదల బతుకులు మారుతాయి అనే తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకొని బిల్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వం పాలించినప్పటికీ సొంత ఇల్లు సహకారం కల నెరవేరలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదల బతుకులు మారుతాయని ప్రభుత్వాన్ని కోరికగా బిల్లు నిలుపుదల చేయడం సబబు కాదని తక్షణమే ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లబ్ధిదారులు కోరారు.

## కారేపల్లిలో సంబరంగా హోలీ వేడుకలు

**డబ్బు వాయిద్యాలతో రంగురంగుల కలర్లతో యువత ఉత్సాహం**





సింగరేణి మార్చి 5 నిర్భయవార్త ప్రతినిది:సింగరేణి మండలంలో హోలీ వేడుకలు సందడిగా సాగాయి. ప్రభుత్వం హోలీ సెలవు దినం మంగళవారం ప్రకటించినా ఆ రోజు చంద్రగ్రహణం కావటంతో పండుగ జరపలేదు. మండలంలోని గ్రామాల్లో బుధవారంహోలీ జరుపుకున్నారు. తండాలు హోలీ వేడుకలతో సందడి గా మారాయి. కారేపల్లిలో బీసీ కాలనీ యువకులు కారేపల్లి డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా హోలీ వేడుకను జరిపారు. యువకులు తమ సవాసగాళ్లను ఆటపట్టిస్తూ తలపై కోడి గ్రుడ్లు కొడుతూ, నల్లని తారు అయిల్ పూస్తూ అనందంతో నృత్యాలు చేశారు. వయసు, ఆడమగ, తారతమ్య బేధాలు పక్కన పెట్టి హోలీ జరుపుకున్నారు.

## కేపిహెచ్‌బీ కాలనీలో జనసేనలో 31 మంది మహిళల చేరిక



కూకట్‌పల్లి,నిర్భయవార్త ప్రతినిది: కేపిహెచ్‌బీ 5వ ఫేజ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు పవన్ నాయుడు ఆధ్వర్యంలో, సైబరాబాద్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ సమక్షంలో 31 మంది మహిళలు జనసేన పార్టీలో అధికారికంగా చేరారు.




కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ పరిధిలోని గాయత్రి నగర్ డివిజన్‌కు చెందిన మహిళలు క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీలో చేరగా, ప్రేమకుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ, జనసేన పార్టీ స్థాపకుడు పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు మరియు సమాజ సేవ పట్ల ఆయనకున్న అంకితభావం ప్రజలను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి భాగస్వామ్యం పార్టీ బలాన్ని మరింత పెంపొందిస్తుందని అన్నారు. జనసేన పార్టీ సామాన్య ప్రజల హక్కుల సాధనకు, పారదర్శక పాలనకు, యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన మహిళలు సమాజ సేవలో చురుకుగా పాల్గొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కూకట్‌పల్లి జోన్ కో-ఆర్డినేటర్లు మండలి దయాకర్, కొల్లా శంకర్, మండలి అనిల్, అడక్ కమిటీ సభ్యులు అనిత గాలి, వేముల మహేష్, పోలేబోయిన శ్రీనివాస్, రణదీప్, యోగేష్, జాల రవి, తుంగల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేత





ఉప్పల్, మార్చి4 నిర్భయవార్త ప్రతినిది: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి వైద్య విద్యకు అయ్యే ఫీజును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నివాసంలో 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఎల్అర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం -నాగన్ పల్లి రోడ్డు పనులు త్వరగాపూర్తి చేయాలి

**సర్పంచ్ భర్తల యాదయ్య**





ఇబ్రహీంపట్నం 4 నిర్భయవార్త ప్రతినిది: ఇబ్రహీంపట్నం- నాగన్ పల్లి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నాగన్ పల్లి సర్పంచ్ భర్తల యాదయ్య అన్నారు. గ్రామఅభివృద్ధి పనులలో భాగంగా రోడ్డు వైన్డింగ్లో మట్టి పోసి చదును చేయిస్తున్న గ్రామ సర్పంచ్ భర్తల యాదయ్య. ఇటీవల రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో రోడ్డు మధ్యలోనున్న విద్యుత్తు స్తంభాలను తీసివేయాలని కోరారు. సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులకు రోడ్డు అర్థంకాక ఇటీవల ఒక ఆర్టీసీ డ్రైవర్ ప్రమాదానికి గురై మరణించాడని, రోడ్డు కాంట్రాక్టర్ విశ్వసముద్రం,ఆర్ అండ్ బి సంస్థ త్వరపడి రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు .కార్యక్రమంలో నరసింహ్మా, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్ర నిర్వహణ అభినందనీయం

**58వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల అనిత**



మంచిర్యాల, మార్చి 4, నిర్భయవార్త ప్రతినిది: మంచిర్యాల మున్సిపల్ పరిధిలో గల 58 వ డివిజన్ గో సేవా మండల్ లో గల అంగన్వాడి కేంద్రం నిర్వహణ అభినందనీయమని 58వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల అనిత అన్నారు. బుధవారం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన గర్భవతులకు శ్రీమంతాలు, పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ కార్యక్రమంలో స్త్రీ శిశువు సంక్షేమ శాఖ సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆయా మల్లీశ్వరి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం నిర్వహణ సంతృప్తికరంగా ఉందని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, గర్భవతులు సమయానుసారంగా చేసుకోవాల్సిన వైద్య పరీక్షలపై అవగాహన కల్పించాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం 58వ డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నికైన బొట్ల అనిత ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీలు, అంగన్వాడి కేంద్రం పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

### బోయిన్ పల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖి



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో నిర్భయవార్త ప్రతినిది:మార్చి 04 : సిరిసిల్ల జిల్లా బోయిన్ పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, కోడిగుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. బుధవారం రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తు నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.


# మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

### బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం, తహసిల్, కార్యాలయం ఆకస్మిక తనిఖీలు



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో నిర్భయవార్త ప్రతినిది: మార్చి 04 : వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా బోయిని పల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు.రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి ఆనారోగ్య సమస్యను తెలుసుకున్నారు. పీ హెచ్ సీ పరిధిలో కొత్తగా, ఇప్పటికే మొదలు పెట్టిన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై వైద్యాధికారిని ఆరా తీశారు. వాటి పై అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు.



**తహసీల్ కార్యాలయంలో పరిశీలన**

మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, భూ భారతి రిజిస్ట్రేషన్ గది, కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.కార్యాలయానికి వచ్చే వారికి సేవలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేసారు. ఇక్కడ తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్లోక పాఠశాలకు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం అందజేత

### తలసేమియా వ్యాధి చిన్నారుల రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్నందుకు గాను ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు




కామారెడ్డి, నిర్భయవార్త ప్రతినిది:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ కు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం – 2026 ను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) మరియు కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, ఐవిఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ సహకరించడం జరుగుతుందని,పాఠశాల అంటే కేవలం విద్య మాత్రమే కాదని విద్యతో పాటుగా సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ఎంతగానో అభినందనీయమని అన్నారు.రక్తదాన శిబిరం నిర్వహించాలంటే చాలామంది సహాయ, సహకారాలు అవసరం అవుతాయని,రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్న వారందరికీ అవార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు.తల సేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉందని అలాంటి చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి రాబోయే రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని అన్నారు.ఈ శిబిరాలను విజయవంతం చేయడానికి సామాజిక సేవకులు,రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# కారేపల్లిలో సంబరంగా హోలీ వేడుకలు.

### డబ్బు వాయిద్యాలతో రంగురంగుల కలర్లతో యువత ఉత్సాహం.



సింగరేణి మార్చి 5 నిర్భయవార్త ప్రతినిది: సింగరేణి మండలంలో హోలీ వేడుకలు సందడిగా సాగాయి. ప్రభుత్వం హోలీ సెలవు దినం మంగళవారం ప్రకటించినా ఆ రోజు చంద్రగ్రహణం కావటంతో పండుగ జరపలేదు. మండలంలోని గ్రామాల్లో బుధవారంహోలీ జరుపుకున్నారు. తండాలు హోలీ వేడుకలతో సందడి గా మారాయి. కారేపల్లిలో బీసీ కాలనీ యువకులు కారేపల్లి డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా హోలీ వేడుకను జరిపారు. యువకులు తమ సవాసగాళ్లను ఆటపట్టిస్తూ తలపై కోడి గ్రుడ్లు కొడుతూ, నల్లని తారు అయిల్ పూస్తూ అనందంతో నృత్యాలు చేశారు. వయసు, ఆడమగ, తారతమ్య బేధాలు పక్కన పెట్టి హోలీ జరుపుకున్నారు.



# మున్నీరు పాలేరు లింక్ లింక్ కెనాల్ పై అవగాహన పేరుతో అబద్ధాల ప్రచారం.

### మున్నేరు జల సాధన కమిటి తీవ్ర ఖండన



మహబూబాబాద్, నిర్భయవార్త ప్రతినిది: గార్ల మండలంలో గిరిజన రైతులకు తీవ్ర నష్టం కలిగించే మున్నేరు పాలేరు లింక్ కెనాల్ (జి.వో. నం: 98) పై అవగాహన సభల పేరుతో ప్రభుత్వ అధికారులు ప్రజలకు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మున్నేరు జలసాధన కమిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు బుధవారం స్థానిక మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మున్నేరు జలసాధన కమిటీ నాయకులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.బుధవారం నాడు బుద్ధారం, చంద్రగిరి గ్రామాలలో నిర్వహించిన సభలపై అధికారులకు ఏమాత్రం స్పష్టత లేదన్నారు. ఒకసారి అవగాహన సభ అని, మరొకసారి పీసా గ్రామ సభ అని పేర్కొంటూ కొందరు స్థానికులను సభలోనికి రాకుండా పోలీస్ పహారాలో సభలు నిర్వహించడం సరికాదన్నారు. ప్రజలను రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెద్ద కిష్టాపురం సర్పంచ్ గంగావత్ రాంసింగ్ చంద్రగిరి సభలో జలసాధన కమిటీ నాయకుల పై దుర్భాషలాడడాన్ని జలసాధన కమిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యవహార శైలిని మార్చుకోవాలని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావతి లక్ష్మణ్ నాయక్ మున్నేరు జలసాధన కమిటీ కో కన్వీనర్లు జడ సత్యనారాయణ, కట్టెబోయిన శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, విశ్వ జంపాల, కత్తి సత్యం, జంపాల వెంకన్న, గుగులోత్ సక్రు, శీలంశెట్టి రమేష్, ఇరి రవి, పాల నాగేశ్వరరావు, బాదం రాజేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు

# ఖమ్మం జిల్లా కలెక్టర్ కారేపల్లి ప్రభుత్వ వైద్యశాలపై దృష్టి పెట్టండి..

### రైతును గోసపెడుతున్న పశు వైద్యశాల

### మూగజీవుల ఘోష ఏ అధికారి పట్టించుకోను

### పశువులను కాపాడవలసిన వైద్యశాల తాళాలకే పరిమితం






సింగరేణి మార్చి 5 నిర్భయవార్త ప్రతినిది: సింగరేణి మండలం కేంద్రంలో పశు వైద్యశాల బుధవారం తాళాలకే పరిమితమైంది. విధి నిర్వహణలో ఉండవలసిన వైద్యాధికారులు, ఇబ్బంది ఏ ఒక్కరు లేకపోవడం తాళాలు తీయకపోవడంతో నిర్విరీరంగా మారింది. మండల పరిధిలోని చీమల వారి గూడెం గ్రామానికి చెందిన ఓ రైతు తన ఆవు దూడ అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో తక్షణ వైద్య నిమిత్తం మండల కేంద్రంలోని కారేపల్లి పశు వైద్యశాలకు తరలించగా తాళం వేసి ఉండడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పైగాపులు కాస్తూ వైద్యాధికారి వచ్చి తన ఆవు దూడను కాపాడుతారో అనే ఉద్దేశంతో వేచి చూడగా తాళం తీసే దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. గ్రామస్తుల సహాయంతో తనకు మంచినీళ్లు పోసి స్పృహ లేపి ఏమైందంటూ కోరగా తన ఆవు దూడ బాగాలేక వైద్యానికి తీసుకొస్తే ఎవరూ లేరని తెలిపారు. అందుబాటులోని వైద్యులకు ఫోను చేయగా ఎవరు అందుబాటులో రాకపోగా కన్నీటితో మునిగిపోయారు. జిల్లా అధికారులకు పలువురు ఫోను చేయగా ఎవరు సెలవులో లేరంటూ అందరూ డ్యూటీలో ఉండాలని జిల్లా అధికారులు తెలపగా మండల కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో రైతు దిగులు చెందాడు. వైద్య అధికారి ఇందిరాగా ఫోను చేయగా అందుబాటులో లేనని తెలపడం జరిగింది. జిల్లా అధికారికి ఫోను చేయగా ఎటువంటి సమాచారం లేదని అందరూ డ్యూటీలో ఉండాలని తెలిపారు. కారేపల్లి ప్రభుత్వ పశు వైద్యశాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పశు వైద్యశాల వైద్యులపై చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

# ఇందిరమ్మ బేస్మెంట్ బిల్లు మంజూరు కై నిరీక్షణ

### నాలుగు నెలలు దాటిన బిల్లు రాని వైనం

### బిల్లు విడుదలయితే నిర్మాణం ముందుకు సాగెను

### బిల్లు మంజూరు చేసి పేదల సొంతింటి కల సహకారం చేయాలి..



ఖమ్మం మార్చి 5 నిర్భయవార్త ప్రతినిది: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పేదల సొంతింటి కల సహకారం చేయాలని ఉద్దేశంతో నెలకొన్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన లబ్ధిదారులకు మంజూరైనప్పటికీ సొంత జాగాలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నర్వే హయాంలో ఇల్లు లేక గత దివంగత రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ఆ ఇండ్లలో రెంట్ కు ఉండడంతో అధికారులు స్లాబ్ ఇల్లని శ్రీ3 లో చేర్చడం ద్వారా ప్రస్తుతం ఇంటి నిర్మాణం బేస్మెంట్ లెవెల్ పూర్తయి మొదటి బిల్లుకు అప్రూవల్ చేయగా బిల్లు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసుకుని మరి ఇల్లు నిర్మాణం చేస్తున్నప్పటికీ సకాలంలో బిల్లు రాక స్టేజి వైస్ అధికారుల దగ్గర పెండింగ్ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్3 లో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇండ్లకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బిల్లు మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదల బతుకులు మారుతాయి అనే తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకొని బిల్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వం పాలించినప్పటికీ సొంత ఇల్లు సహకారం కల నెరవేరలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదల బతుకులు మారుతాయని ప్రభుత్వాన్ని కోరికగా బిల్లు నిలుపుదల చేయడం సబబు కాదని తక్షణమే ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లబ్ధిదారులు కోరారు.

# సమాధానం చెప్పడం చేతకాక కుల ప్రస్తావన తీసుకురావడం సరి కాదు

## అంటూ మండిపడ్డ మాలిశెట్టి శివ వైఎస్ఆర్సిపి జాయింట్ సెక్రటరీ




కడప జిల్లా నిర్భయవార్త ప్రతినిది: ఎర్ర గుంట్ల మంత్రి అచ్చం నాయుడు వ్యాఖ్యలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాను . ఈరోజు శాసనమండలిలో తిరుమల లడ్డు ప్రసాదం మీద చర్చ జరుగుతున్న సందర్భంలో ప్రతిపక్ష వైసిపి శాసన మండలి సభ్యులకు సరైన సమాధానం చెప్పడం చేతకా క కులాల ప్రస్తావన తీసుకురావడం అత్యంత దారుణం మండలి స్పీకర్ను మరియు మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నీ ఉద్దేశించి కుల ప్రస్తావన తీసుకు రావడం సంస్కారవంతం కాదు ఎందుకంటే గత దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్పుడు ఆయన తీసుకువచ్చిన అనేక సంక్షేమ పథకాలు ఆరోగ్యశ్రీ 108 ఫీజు రియంబర్స్మెంట్ 104 ఉచిత విద్యుత్ తో పాటు అనేక సంక్షేమ పథకాలను కులమతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలకు చేరువ చేసి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా మిగిలి ఉన్నాడు అలాగే వారి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన 2019 నుంచి 2024 మధ్యన ఆయన తీసుకువచ్చిన అనేక సంక్షేమ పథకాలలో లబ్ధిదారులను ఎంపిక చేసేటప్పుడు ఆయన చెప్పిన మాటలు కులం చూడం మతం చూడం పార్టీలు చూడం అంటూ అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా తమ పథకాలను అందేలా చూడమని అధికారులను ఆదేశించడం మనం చూడలేదా ఏ ఒక్క పథకాన్ని అయినా గాని పలాని కులానికి మాత్రమే చెందేలా చేయమని చెప్పలేదు కదా ముఖ్యంగా తిరుమల విషయంలో కూడా దివంగత నేత శ్రీ వైయస్ రాజశేఖర్ రెడ్డి 2007లో తిరుమల అంటే అప్పటివరకు రెండు కొండలుగానే పరిగణిస్తూ ఉన్న ఉత్తర్వులను ఏడుకొండలుగా మారుస్తూ రాజ్యాంగబద్ధంగా రెండు జీవోలను తీసుకు వచ్చి తిరుమలను పవిత్రతను మరింత పెంచారు కేవలం తన బినామీ సంస్థకు అధిక ధరకు నెయ్యి సరఫరా ను కట్టబెట్టడం కోసం అప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా అనేక కోట్లాది మంది హిందువులు కొలిచే శ్రీ వెంకటేశ్వర స్వామి కి అత్యంత ప్రీతి అయిన లడ్డు ప్రసాదం మీద ఎలాంటి సరైన ఆధారాలు లేకపోయినా ఒక ముఖ్యమంత్రి స్థానంలో తాను ఉన్నానని అని మరిచి కోట్లమంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్యాన్ని ప్రచారం చేసి దాని ద్వారా నెయ్యిలో నాణ్యత లోపించిందని ప్రచారం చేస్తూ తెర వెనుక తన బినామీ సంస్థకు అధిక ధర కు నెయ్యిని సరఫరా వచ్చేలా శ్రీవారి సొమ్ముకు కన్నం వేసిన విషయం ఈ మధ్యకాలంలో బహిర్గతమై ఆంధ్ర ప్రదేశ్ ప్రజలే కాదు యావత్ దేశ ప్రజలు కూడా గమనిస్తున్నారు ఎందుకంటే ఇటీవలే సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు ఏర్పడిన సిబిఐ సిట్ వారు తిరుమల లడ్డు ప్రసాదం తయారీలో ఎలాంటి జంతు కొవ్వు కలవలేదని ఒక నివేదికను కోర్టుకు అందజేసినది ఆ నివేదికలు గత వైసిపి ప్రభుత్వంలోని టీడీపీ చైర్మన్ ను గాని వైసీపీకి సంబంధించిన ఎవరిని కూడా సిటీలో వారు పేర్కొనలేదు ఈ నివేదిక వచ్చిన తర్వాత అప్పటివరకు కల్తీ విషయాన్ని ప్రాపకాండ చేసిన కూటమి పార్టీకి చంపపెట్టుగా మారింది వైసిపి పార్టీ వారు చేస్తున్న ఆరోపణలకు సరైన సమాధానాలు చెప్పలేకపోగా దాడులకు కూడా తెగబడడం రాష్ట్ర ప్రజలందరూ కూడా గమనించారు కావున కూటమి ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేసుకునే దానిమీద ఉన్న శ్రద్ధ ను పరిపాలన మీద చూపాలని ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల బాధ్యతగా ఉండాలని ఈ సందర్భంగా హితువు పలుకుతున్నాను లేకపోతే మీ ధోరణి ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడి కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెబుతారని సందర్భంగా హెచ్చరిస్తున్నాం

## రంజాన్ పండుగ పురస్కరించుకొని ఈద్గాలో సౌకర్యాలు కల్పించాలి

### 33వ వార్డు కౌన్సిలర్ పంబాల సుజాత – రాము



జగిత్యాల బ్యూరో మార్చి 04 నిర్భయవార్త ప్రతినిది: రాబోయే రంజాన్ పండుగ పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ఈద్గాలో మైనార్టీ సోదరులకు తగిన సౌకర్యాలు కల్పించాలని స్థానిక 33వ వార్డు కౌన్సిలర్ పంబాల సుజాత రాము బుధవారం బల్దియా చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈద్గాలో పిచ్చి మొక్కలు పెరిగాయని వాటిని తొలగించి కుర్చీలు సౌండ్ సిస్టం సీలింగ్ టెంట్లు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉపశమనం పొందేందుకు సరియగు కూలర్లు త్రాగునీరు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. చైర్మన్ సానుకులంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## 108 వాహనంలో బిడ్డకు జన్మనిచ్చిన తల్లి



తాండూర్, నిర్భయవార్త ప్రతినిది: (మార్చి 108) వాహనంలో మహిళ ప్రసవించిన ఘటన బుధవారం తాండూర్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన మాడే శాంత అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని, గర్భిణిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో తీసుకెళ్తుండగా మధ్యలో నొప్పులు అధికం కావడంతో , రోడ్డు పక్కనే వాహనాన్ని నిలిపి ప్రసవం చేశారు. శాంత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని సిబ్బంది శివకృష్ణ, పైలెట్ అన్నం తిరుపతి తెలిపారు

## 108 సిబ్బంది సేవలు అభినందనీయం



తాండూర్, నిర్భయవార్త ప్రతినిది: (మార్చి 04) 108 అంబులెన్స్ సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, ఇంచార్జీ కొండలరావు తెలిపారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాల సిబ్బంది సేవలను, కేసులు నమోదు చేసే రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి కేటాయించిన 108 అంబులెన్స్ అతి తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రాణాలను కాపాడరని, ఈ క్రమంలో దాదాపు 1600 మందిని స్థానిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన 108 సిబ్బంది పైలెట్ అన్నం తిరుపతి, ఈఎంటి శివకృష్ణ, ప్రశాంత్, తిరుపతి లను అభినందించారు.

## క్రికెట్ టోర్నమెంట్ ముగింపు



రాయికల్ మార్చి 4 నిర్భయవార్త ప్రతినిది: రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలోని శ్రీరామ్ స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో అనేక రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో బట్టపెల్లి పోతారం మరియు రంగపేట్ జట్లు ఫైనల్‌కు చేరుకుని ఉత్కంఠభరితంగా పోటీ పడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో రంగపేట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో రూ. 20,000 నగదు బహుమతిని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన బట్టపెల్లి పోతారం జట్టుకు రూ. 10,000 నగదు బహుమతిని తాట్లవాయి గ్రామానికి చెందిన దాత పాలేపు సురేష్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు నరేష్, తిరుపతి శ్రీకర్, ఉదయ్, శేఖర్, తిరుపతి రాజేష్ తదితరులు పాల్గొని టోర్నమెంట్ విజయవంతానికి కృషి చేశారు. స్థానిక క్రీడాకారులను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

## వివేకవర్ధిని పాఠశాలలో ఘనంగా క్రీడోత్సవం ప్రారంభం



నిర్భయవార్త ప్రతినిది: రాయికల్ మార్చి 4: రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాలలో 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో



నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు టార్చ్ బేరర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేసి క్రీడా జ్యోతిని వెలిగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం క్రీడాకారుల పరేడ్‌కు అతిథులు అభివాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ శ్రీపతి రాఘవులు, ఎంఆర్ఓ నాగార్జున, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చదువుతో పాటు ఆటలలోనూ ప్రతిభ కనబర్చాలని, క్రమశిక్షణ, జట్టు భావన క్రీడల ద్వారా అభివృద్ధి చెందుతాయని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్, కౌన్సిలర్లు పుర్రె శ్రీధర్, మచ్చ గంగలక్ష్మి, ఎలిగేటి లతిక అనిల్ కుమార్, భూక్య రాకేష్ నాయక్, కల్లెడ చిన్న ధర్మపురి, పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, అడ్వకేట్ మచ్చ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరం సత్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూపా, మోర విజయ్, ఉపేందర్, కుందారపు శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. క్రీడా పోటీలు రాబోయే రోజుల్లో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వెంకటేశ్వర స్వామీ ఆలయ అభివృద్ధి కోసం విరాళం ఇచ్చిన తూడి లచ్చన్న



నిర్భయవార్త ప్రతినిది: మార్చ్4 గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలో జరుగుతున్నటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిధిగా యా యువసేన అధ్యక్షులు సామజిక వేత్త శ్రీ తూడి లచ్చన్న పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధి కోసం 20016/- విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ కి ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మన్ మరియు గ్రామ పెద్దలు, యువకులు మరియు యా యువసేన సభ్యులు పాల్గొనడం జరిగింది.

## బెల్లంపల్లి పట్టణంలో ఆర్యవైశ్యుల హోలీ సంబరాలు




బెల్లంపల్లి, మార్చి 04 నిర్భయవార్త ప్రతినిది: రంగుల పండుగ హోలీ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో ఆర్యవైశ్యుల సమాజం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లి ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు.. చెడుపై మేలుకి సంకేతంగా హోలీ పండుగను జరుపుకుంటామని, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించుకోవాలని అన్నారు . యువత, మహిళలు ప్రత్యేకంగా పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో భాగంగా పరస్పరం హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచుకున్నారు. సమాజ ఐక్యతకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. శాంతి, సౌహార్ద వాతావరణంలో హోలీ సంబరాలు చేసుకున్నారు.

## బెల్లంపల్లిలో హోలీ సంబరాలు



బెల్లంపల్లి మార్చి 04 నిర్భయవార్త ప్రతినిది: బెల్లంపల్లి పట్టణంలో బుధవారం హోలీ పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ హోలీ పండుగ సందర్భంగా ఏసీపీ రవి కుమార్‌ను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణంలోని ప్రముఖ వ్యాపారులను వారి దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలుపగా, వారు కూడా పరస్పరం రంగులు పూసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచే యువత, చిన్నారులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో సంబరాల్లో పాల్గొన్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు రంగులతో కళకళలాడాయి.

## పెళ్లిరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం





నిర్భయవార్త ప్రతినిది: రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాల అధినేత బాలె జయశ్రీ--శేఖర్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ నివేదిత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు వృద్ధులతో కలిసి హోలీ వేడుకలను ఆనందంగా నిర్వహించారు. రంగుల సందడి మధ్య విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా, వృద్ధులు సంతోషంగా పాల్గొన్నారు. ఈ వేడుకలతో ఆశ్రమం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా బాలె శేఖర్ మాట్లాడుతూ, “మా వివాహ వార్షికోత్సవాన్ని వృద్ధుల మధ్య నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. పెద్దల ఆశీస్సులు జీవితంలో మరింత స్ఫూర్తినిస్తాయి. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాము,” అని తెలిపారు. వృద్ధులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని, యువతలో సేవాభావాన్ని పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు స్వామి, గోపాల్ రెడ్డి, రమ్య, శ్రీలక్ష్మి, సమాజ సేవకులు ఎనుగందుల రమేష్, నివేదిత వృద్ధాశ్రమ పర్యవేక్షకుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# కృత్రిమ..భామ!

- అందుబాటులోకి ai హీరోయిన్
- సినీ రంగానికి షాక్
- నటనలోనే మేటి
- రీల్, రియల్ హీరోయిన్లకు కష్టాలే



భారతీయ బుల్లితెర చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. సాంకేతిక పరిజ్ఞానం అంచుల ను తాకుతూ.. మనుషులకు దీటుగా నటించేందుకు నైనా ఏవీటీఆర్ అనే ఏఐ బ్యూటీ సిద్ధమైపోయింది. ఇప్పటికే నైనా నటించిన కొన్ని వీడియోలు, డ్యాన్స్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్లకు సంబంధించిన ఇన్ స్టా వీడియోలు ఇంటర్నెట్ ని కుదిపేస్తున్నాయి.
ఇప్పటికే ఆర్జీవీ, కమల్ హాసన్ లాంటి అడ్వాన్స్ డ్ థింకింగ్ ఉన్న ప్రముఖులు కృత్రిమ మేథస్సును సద్వినియోగం చేయడంపై దృష్టి సారించారు. ఆర్జీవీ రీసెర్చ్ ప్రకారం.. భవిష్యత్‌లో సినిమా ఇండస్ట్రీలో ఎవరికీ పని ఉండదు...క్రియేటర్లు ఎవరి పని వారే చేసుకోవచ్చు. తన క్రియేటివిటీ తన ఐడియాలజీ తన అభిరుచి ప్రకారం.. ఒక సినిమాని సాంకేతికతను ఉపయోగించి తయారు చేయొచ్చని వర్మ విశ్లేషిస్తున్నారు. పరిమిత కాస్టింగ్.. పరిమిత క్రూతో చాలా సినిమాలను రూపొందించేందుకు కృత్రిమ మేథస్సు అవకాశం కల్పిస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా మొట్టమొదటి ఏఐ హీరోయిన్ పుట్టుకు రావడం కలకలం రేపుతోంది. నైనా ఏవీటీఆర్ ఇప్పుడు తాజా సెన్సేషన్. ఈ ఏఐ బ్యూటీ కిల్లింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను, బుల్లితెరను షేక్ చేస్తోంది. కేవలం మనుషులు మాత్రమే నటించగలరనే భావనను చెరిపివేస్తూ.. ఈ ఏఐ సుందరి తన కిల్లర్ మూవ్స్‌తో ప్రేక్షకుల మతి పోగొడుతోంది.

దీనిని నిశితంగా గమనిస్తే... నైనా కేవలం ఒక యానిమేషన్ బొమ్మ మాత్రమే కాదు.. అత్యంత అధునాతనమైన మెషిన్ లెర్నింగ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీల మేళవింపుతో సృష్టించిన ఒక అద్భుత దృశ్య కావ్యం. ఈ సరికొత్త టెక్నాలజీ వల్ల నైనా అనే పాత్రధారి కదలికలు, ప్రవర్తన అచ్చం నిజమైన నటిని తలపిస్తూ ప్రేక్షకులను మాయ చేస్తున్నాయి. నైనాను ఇంత రియలిస్టిక్‌గా చూపించడం వెనుక హైఎండ్ గ్రాఫిక్స్ రెండరింగ్ సాంకేతికత కీలక పాత్ర పోషించింది. ఆమె చర్మం రంగు, జుట్టు గాలికి ఊగే విధానం, కళ్లలోని సహజమైన మెరుపును గమనిస్తే ఈ బ్యూటీ ఒక వర్చువల్ క్యారెక్టర్ అని నమ్మడం కష్టంగా ఉంది. సాధారణ ఏఐ బొమ్మల్లో ముఖ కవళికలు కృత్రిమంగా, బిగుతుగా ఉంటాయి. కానీ నైనా విషయంలో కోపం, సంతోషం, బాధ వంటి సున్నితమైన ఎమోషన్లను పలికించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. ఈ ఎమోషన్స్ ని పలికించడం కోసం సుమారు 50కి పైగా ఫేషియల్ మ్యాపింగ్ పాయింట్స్ ను వాడారు. అందుకే ఆమె పలికించే హావభావాలు ఆ కిల్లింగ్ లుక్స్ ప్రేక్షకులకు చాలా సహజంగా అనిపిస్తున్నాయి.




# రై రై సాంగ్ రయ్ రయ్!

- రామ్ చరణ్ సరికొత్త రికార్డ్
- పెద్ది రైరై పాట సంచలనం
- 24 గంటల్లో 46.1మిలియన్ వ్యూస్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న 'పెద్ది' సినిమా కంప్లీట్ మాస్ అండ్ రస్టిక్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోంది. . ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'చికిరీ చికిరి' చార్ట్‌బస్టర్‌గా నిలిచి సినిమాపై మంచి పాజిటివ్ వైబ్ క్రియేట్ చేసింది. ఇక లేటెస్ట్ గా వచ్చిన రెండో సింగిల్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. 'రై రై రా రా' సాంగ్ విడుదలైన మొదటి గంట నుంచే సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. ఏఆర్ రెహమాన్ తనదైన స్టైల్‌లో అదిరిపోయే మాస్ బీట్ ఇవ్వడమే కాకుండా, స్వయంగా పాడటం ఈ పాటకు పెద్ద ప్లస్ పాయింట్. అనంత శ్రీరామ్ రాసిన పవర్‌ఫుల్ లిరిక్స్ కథలోని ఇంటెన్సిటీని చూపిస్తున్నాయి. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో చరణ్ వేసిన స్టెప్పులు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రికార్డుల విషయానికి వస్తే, 'రై రై రా రా' కేవలం 24 గంటల్లోనే సౌత్ ఇండియా లెవల్‌లో ఆల్ టైమ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఐదు భాషల్లో కలిపి ఈ పాట ఏకంగా 46.1 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి హిస్టరీ క్రియేట్ చేసింది. ఒక్క తెలుగులోనే 29.21 మిలియన్ల వ్యూస్ రాబట్టి, అంతకుముందు 'చికిరీ చికిరి' పేరిట ఉన్న 29.1 మిలియన్ల రికార్డును ఇది దాటేసింది. మ్యూజిక్ చార్ట్స్ లో నెంబర్ వన్ ప్లేస్ లో ట్రెండ్ అవుతూ తన సత్తా చాటుతోంది. కేవలం వ్యూస్ మాత్రమే కాకుండా 8 లక్షలకు పైగా లైక్స్ కూడా ఈ పాటకు రావడం విశేషం.



# ఆగ్రహం.. జూమ్!

- మా శరీరాలేనా మీ పెట్టుబడి
- జూమ్ చేసి వీడియోలు, ఫొటోలు
- మండిపడుతున్న యంగ్ హీరోయిన్స్

సినిమా సెలబ్రిటీలు పబ్లిక్ ఫిగర్స్ కాబట్టి బయట ఎక్కడ కనిపించినా సరే అభిమానులు , సామాన్య ప్రజలు వారితో కరచాలనం చేయాలని, మాట్లాడాలని, సెల్ఫీ దిగాలని ఇలా ఏవేవో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అయితే ఇక్కడ కొంతమంది ఆకతాయిలు మాత్రం కెమెరాలతో జూమ్ చేసి మరీ ఫోటోలు తీస్తుండడంతో యంగ్ బ్యూటీస్ ఇప్పుడు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శరీర భాగాలను జూమ్ చేసి మరీ ఫోటోలు తీస్తున్నారంటూ.. ఈ క్రమంలోనే ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో మరో ఉద్యమం మొదలైందా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. కన్నడ బ్యూటీలైన సప్తమి గౌడ, ఆశికా రంగనాథ్, రుక్మిణీ వసంత్ తాజాగా తమ ఇంస్టాగ్రామ్ ద్వారా పెట్టిన పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్ కి హాజరయ్యే హీరోయిన్స్ , నటీమణులను అభ్యంతరకర రీతిలో ఫోటోలు తీయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని కథానాయికులు మండిపడుతున్నారు. జూమ్ చేసి మరీ తమ శరీరాలను ఫోటోలు తీయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులు కూడా పంచుకుంటూ ఉండటంతో ఈ విషయం కాస్త హాట్ టాపిక్‌గా మారింది.

## ఆకతాయిల ఆగడాలను అరికడతారా?

ఇన్ని రోజులు సినిమా ఇండస్ట్రీలో లైంగిక వేధింపులు ఉన్నాయని, అవకాశాలు రావాలి అంటే సినిమా నిర్మాతలు, దర్శకులు, హీరోలు చెప్పినట్టు చేయాలి అనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో.. మరొకవైపు ఇలా ప్రత్యేకించి కన్నడ బ్యూటీలు సినిమా ఈవెంట్‌లో పాల్గొన్నప్పుడు లేదా బహిరంగ ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు తమ శరీర భాగాలను జూమ్ చేసి మరి ఫోటోలు తీస్తున్నారంటూ వాపోడం హాట్ టాపిక్ మారింది. మరి ఈ విషయంపై ఇండస్ట్రీ పెద్దలు, అధికారులు ఏదైనా నిర్ణయం తీసుకుంటారేమో చూడాలి.



దాదాపు తొమ్మిదేళ్ల క్రితం రిలీజైన మామ్ మూవీ బాలీవుడ్‌లో భావోద్వేగ ప్రధాన చిత్రంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా శ్రీదేవి తన కెరీర్‌లో అత్యంత ప్రశంసలు అందుకున్న ప్రదర్శనగా ఈ సినిమా నిలిచింది. ఇప్పుడదే సినిమాకి సీక్వెల్ రూపంలో మామ్2 సెట్స్‌పైకి రావడంతో, ఫ్రాంచైజ్‌పై మళ్లీ ఆసక్తి పెరిగింది. అయితే ఈసారి ఫోకస్ పూర్తిగా కొత్త తరం వైపు మళ్లింది. లవ్ యాపా సినిమాలోని యాక్టింగ్ కు విమర్శలు

# మరోసారి.. మామ్!

- శ్రీదేవి సినిమా రీమేక్
- హీరోయిన్‌గా ఖుషి కపూర్
- తొమ్మిదేళ్ల క్రితం వచ్చిన సినిమాకు మళ్లీ క్రేజ్

మామ్2లో మెయిన్ లీడ్ గా శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ కనిపించనుంది. ఇప్పటికే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమెకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. మామ్2 ఆమె కెరీర్‌కు నిజమైన టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న చర్చ మొదలైంది. భావోద్వేగంతో పాటు బలమైన న్యాయపరమైన కథనం ఉండే ఈ ఫ్రాంచైజ్‌లో ఆమె పెర్ఫార్మెన్స్ ఆడియన్స్ అంచనాలను అందుకోగలదా అన్నది ఆసక్తికరంగా మారింది.





# ఆ సంద్రంలో సయ్యాటలు!

సరికొత్తగా తూనీగ హీరోయిన్ సోషల్ మీడియాలో గ్లామర్ షో

బాలీవుడ్ భామ రియా చక్రవర్తి సోషల్ మీడియాలో ఇటీవల బిజీగా గడుపుతోంది. తాజాగా ఈ యువనటి షేర్ చేసిన వీడియోలో సముద్రపు ఇసుకలో సరదాగా సందడి చేస్తూ కనిపించింది. ముఖ్యంగా బాడీ హగ్గింగ్ ఇన్నర్ వేర్‌లో రియా కనిపిస్తున్న తీరు నెటిజన్ల మతి పోగొడుతోంది. సముద్రపు అలల మధ్య, సూర్యాస్తమయ వేళ తీరిక సమయాన్ని ఆస్వాదిస్తున్న రియా పంచుకున్న ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ యంగ్ బ్యూటీ గ్లామర్ , కాన్ఫిడెన్స్ చూస్తుంటే కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. రియాకు సముద్రం అంటే ఎందుకు అంత పిచ్చి? అనే ప్రశ్న మెదులుతోంది. దానికి సమాధానంగా రియా ఒక అందమైన వ్యాఖ్యను ఈ ఫోటోషూట్ కి జోడించింది. గ్రాటిట్యూడ్ అండ్ సన్‌సెట్స్ అంటూ పోస్ట్ పెట్టింది. ప్రకృతి ఒడిలో ముఖ్యంగా సముద్ర తీరాన గడపడం వల్ల కలిగే ప్రశాంతత తనకు ఎంతో ఇష్టం. అందుకే షూటింగ్‌లకు విరామం దొరికినప్పుడల్లా సముద్రపు హోరును వినడానికి అక్కడి ఇసుకలో ఆడుకోవడానికి ప్రాధాన్యతనిస్తుంది. సముద్రం రియాకు కొత్త శక్తిని ఇస్తుందని చెప్పకనే చెబుతోంది. రియా షేర్ చేసిన ఈ వీడియోపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా ఈ భామ ఎంపికచేసుకున్న డిజైనర్ లుక్ ఎంతో కళాత్మకంగా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఎప్పుడూ క్లాసీగా ఉంటావు బంగారం! అంటూ ఆమె స్టైల్‌ను మెచ్చుకుంటున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197